
సాక్షి నిర్మల్

శనివారం : 21 డిసెంబర్ 2024



గురుకులం పిలుస్తోంది..!

ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థల్లో ఐదోతరగతిలో ప్రవేశం కోసం నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ విడుదలైంది. ఫిబ్రవరి 1వరకు దరఖాస్తు గడువు ఉంది. 8లో▸



దారులన్నీ ధర్మారం వైపే..

లక్ష్మణచాంద మండలం ధర్మారంలో నిర్వహిస్తున్న కోతి దేవుని జాతరకు భక్తులు పోటెత్తారు. కోనేరులో పుణ్యస్నానాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.0 / 18.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

కొత్తకార్డులు వచ్చేనా?



- ఏళ్లుగా నిరీక్షిస్తున్న అర్హులైన పేదలు
- మంత్రి ఉత్తమ్ సానుకూల ప్రకటన
- దరఖాస్తుదారుల్లో చిగురిస్తున్న ఆశలు
- అర్హుల నుంచి 33,719 దరఖాస్తులు

నిర్మల్‌చైన్‌గేట్: సంక్రాంతి నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని శాసనమండలిలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈసారైనా కొత్త రేషన్ కార్డులు చేతికందాలని అర్హులు నిరీక్షిస్తున్నారు. జిల్లాలో పలు దఫాలుగా 33,719 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 8,961 దరఖాస్తుల పరిశీలన కూడా పూర్తయింది. ప్రభుత్వం పథకాల అమలులో రేషన్‌కార్డు ప్రామాణికం కాదని చెబుతూనే ప్రతీ దరఖాస్తుకు రేషన్‌కార్డు జత చేయాలని కోరుతోంది. సీఎం రిలీఫ్ ఫండ్, ప్రభుత్వ కార్యాలయాల ద్వారా జారీ అయ్యే వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తు కోసం అధికారులు రేషన్‌కార్డులు తప్పనిసరి అని చెబుతున్నారు.

కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం

కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం మేరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల సలహాలు, సూచనల మేరకు కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులకు ఎలక్ట్రానిక్ చిప్‌తో కూడిన స్మార్ట్ కార్డు ఇస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. ఇందుకు సంబంధించి నియమనిబంధనలు విడుదల కాగానే.. తిరిగి దరఖాస్తుల స్వీకరణకు మరో అవకాశముంటుందని తెలుస్తోంది. కాగా, కొత్తకార్డులతో పాటు రేషన్ షాపుల ద్వారా సన్నరకం బియ్యం ఇస్తామని సర్కార్ ప్రకటించడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏ దరఖాస్తు ప్రామాణికమో..!

పదేళ్లుగా రేషన్‌కార్డుల కోసం పలువురు దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాపాలన సభల్లో మరోసారి దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఏ దరఖాస్తును ప్రామాణికంగా తీసుకుంటారనేది స్పష్టంగా తెలియడం లేదు. సంక్రాంతి తర్వాత ప్రభుత్వం మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తుందేమో? అనే సందేహాలూ తలెత్తుతున్నాయి. మరోవైపు స్మార్ట్‌కార్డుల రూపంలో తెల్ల రేషన్‌కార్డులు ఇస్తామని చెబుతుండగా.. వీటితో ఏమేం ఉపయోగాలుంటాయో తేలాల్సి ఉంది. గతంలో మాదిరిగానే ఆదాయ పరిమితి ఉంటుందా? మరింత తగ్గిస్తారా? అన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

2020 నుంచి ఫ్రీజింగ్

బీఆర్ఎస్ హయాంలో 2019 జూన్ 30న తెల్లరేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిలిపివేయగా.. 2020లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం కొంతమందికి ఇచ్చినట్లే ఇచ్చి ఫ్రీజింగ్ విధించింది. దీంతో నాటి నుంచి నేటి వరకు వివాహమైవారు, ఉమ్మడి కుటుంబం నుంచి వేరుపడినవారు కొత్త కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. కాగా, అప్పటికే తెల్లరేషన్‌కార్డుల్లో వీరి పేరున్నప్పటికీ.. పుట్టిన పిల్లలను యాడ్ చేయడం, ఆధార్, అడ్రస్, ఫోన్ నంబర్లు సరి చేసుకునేందుకు చాలామంది దరఖాస్తు చేసుకున్నారు.

జిల్లాలోని 'రేషన్' వివరాలు

రేషన్ షాపులు	412
అంత్యోదయ కార్డులు	12,829
ఆహార భద్రత కార్డులు	1,95,598
అన్నపూర్ణ కార్డులు	32
మొత్తం కార్డులు	2,08,459
మొత్తం యూనిట్లు	6,40,837

మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలు

మండలం	దరఖాస్తులు	ఆర్ఐ స్థాయిలో	తహసీల్దార్..	డీఎస్వో..	అప్రూవ్ చేసినవి	రిజెక్ట్ చేసినవి
బాసర	899	556	1	43	274	25
భైంసా	6,265	3,230	202	476	2,218	139
దస్తురాబాద్	782	294	161	154	158	15
దిలావర్‌పూర్	600	432	0	52	106	10
కడెం-పెద్దూర్	1,454	1,073	2	89	263	27
ఖానాపూర్	1,564	680	22	230	592	40
కుభీర్	2,327	1,933	8	61	276	49
కుంటాల	880	524	1	102	227	26
లక్ష్మణచాంద	1,155	897	1	143	88	26
లోకేశ్వరం	1,405	845	3	184	336	37
మామడ	1,051	558	0	75	404	14
ముధోల్	2,166	1,126	15	419	537	69
నర్సాపూర్(జి)	987	581	0	147	231	28
నిర్మల్ రూరల్	1,452	986	6	149	293	18
నిర్మల్ అర్బన్	5,126	2,141	540	876	1,468	101
పెంబి	292	111	0	59	114	8
సారంగపూర్	1,986	610	346	404	582	44
సోన్	1,079	527	1	189	346	16
తానూరు	2,249	687	6	868	448	240

పదేళ్లుగా ఎదురుచూస్తున్నాం

మాకు రేషన్ కార్డు లేక ఇబ్బంది పడుతున్నాం. కార్డు కోసం పదేళ్లుగా ఎదురుచూస్తున్నాం. అర్హులందరికీ కొత్త కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని సంతోషిస్తున్నాం.

– పుప్పాల గణేశ్, పెంబి

పౌష్టికాహారం అందించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులతో సమావేశమై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా తదితర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. కేంద్రాల్లో న్యూట్రిగార్డెన్స్‌ను ఏర్పాటు చేసి పెంచిన ఆకు కూరలు, కూరగాయలను ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించాలని సూచించారు. చిన్నారులకు క్రమం తప్పకుండా బాలామృతం, యూనిఫాంలు అందజేయాలని పేర్కొన్నారు. పర్యవేక్షకులు కేంద్రాల పనితీరును పర్యవేక్షించి నివేదికలు పంపాలని సూచించారు. వందశాతం హాజరయ్యేలా చూడాలన్నారు. సీడీపీవోలు నాగలక్ష్మి, నాగమణి, సరిత, సరోజి, అంగన్‌వాడీ పర్యవేక్షకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ గణిత ప్రతిభ పోటీ పరీక్షలు



ప్రతిభ చాటిన విద్యార్థినులు

నిర్మల్ రూరల్: శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి ఉర్దూ గణిత ప్రతిభ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరీక్షల అధికారి సిద్ధ పద్మ మాట్లాడుతూ.. పోటీ పరీక్షలు విద్యార్థుల్లో ఆలోచనాశక్తిని పెంపొందిస్తుందని చెప్పారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫోరం అధ్యక్షుడు చెట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి, నాగుల రవి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయికి ఎంపిక



మనోరంజన

బాసర: జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన మండలంలోని కిర్గుల్ (బి) జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని ముత్యాల మనోరంజన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా మనోరంజనను శుక్రవారం ఉపాధ్యాయులు అభినందించారు.



మధుప్రియ

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని మధుప్రియ చదరంగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. కలెక్టర్ అభిలాష అభినవ్ చేతుల మీదుగా మొదటి బహుమతి అందుకుంది. విద్యార్థినిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థుల నోట్స్ పరిశీలిస్తున్న గోపీచంద్

లక్ష్మణచాంద: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని ఆర్సీవో గోపీచంద్ సూచించారు. మండలంలోని రాచాపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల నోట్స్ పరిశీలించారు. ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షల తేదీలు వచ్చినందున విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ రాజు, నిరోషా, మహేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని పాటించాలి



వేడుకల్లో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: మత సామరస్యాన్ని పాటించి ఒకరి మతాన్ని ఒకరు గౌరవించుకోవాలని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వేడుకలకు ఎస్పీ హాజరై కేక్ కట్ చేశారు. క్రైస్తవులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, భైంసా ఏఎస్పీ అవినాష్, డీఎస్పీ గంగారెడ్డి, ఏవో యూనిస్ అలీ, ఇన్‌స్పెక్టర్లు నవీన్‌కుమార్, నైలు, సైదారావు, రామకృష్ణ, మల్లేశ్, కృష్ణ, రమణారావు, ఆర్ఎస్సై రవికుమార్, రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్ కోర్టు ఏజీపీగా ఆసిఫ్‌అలీ



ఆసీఫ్ అలీ

ఖానాపూర్: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్) గా స్థానిక కరీంకాలనీకి చెందిన యువ న్యాయవాది ఆసిఫ్ అలీ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ న్యాయవ్యవహారాల శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. తనపై నమ్మకంతో ఏజీపీ బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు ఈ సందర్భంగా ఆసీఫ్ అలీ కృతజ్ఞతలు తెలిపారు. ఆసీఫ్ అలీ నియామకంపై మైనార్టీ నాయకులు షబ్బీర్‌పాషా, సలీంఖాన్, షౌకత్‌పాషా, ఖాజా, అన్వర్, ఖదీర్ హర్షం వ్యక్తంజేశారు.

'డయల్ యువర్ డీఎం'కు విశేష స్పందన

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన 'డయల్ యువర్ డీఎం'కు స్పందన లభించింది. పెంబి మండల కేంద్రానికి అదనపు బస్సు కావాలని, ఖానాపూర్ నుంచి హైదరాబాద్‌కు బస్సు నడపాలని, భైంసాకు సెమీ డీలక్స్ బస్సులు వేయాలని పలువురు ప్రయాణికులు కోరినట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు మరో ఎక్స్‌ప్రెస్ బస్సు నడపాలని సూచించినట్లు పేర్కొన్నారు. ప్రయాణికుల ప్రశ్నలకు సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌టౌన్: మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఇందిరమ్మ మహిళాశక్తి పథకం ద్వారా ఉచిత కుట్టు మిషన్ కోసం మైనార్టీ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి మోహన్‌సింగ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న జిల్లా కేంద్రంలోని మైనార్టీ సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

రంది పడుతున్న కంది రైతు



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు రాజనోల్ల బాలాజీ. ఇతనిది తానూరు మండలం బోరిగాం గ్రామం. తనకున్న నాలుగెకరాల్లో పత్తి సాగు చేసి అంతరపంటగా కంది వేశాడు. తొలుత కంది ఆశాజనకంగా ఉన్నా పూత, కాత దశకు వచ్చేసరికి తెగుళ్లు సోకాయి. దీంతో పంట నిలువునా ఎండిపోయింది. మరో వైపు అడవి జంతువుల బెడదతో పంట మరింత దెబ్బతింది. ఎకరాకు కనీసం మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా రాని దుస్థితి ఉంది. దీంతో తాను నష్టపోయినట్లు బాలాజీ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వచ్చిన కొద్దిపాటి పంటకు మద్దతు ధర కూడా లేదని వాపోతున్నాడు. సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలంటూ ఆందోళన చెందుతున్నాడు. ఈ దుస్థితి ఒక్క బాలాజీది మాత్రమే కాదు.. జిల్లాలోని కంది సాగు చేసిన చాలామంది రైతులది.

- తెగుళ్లు సోకి ఎండిన పంట
- పెట్టుబడులూ రాని దుస్థితి



తానూరు మండలం బెల్‌తరోడా గ్రామంలో ఎండిన కంది

తానూరు: ఈ ఏడాది అధిక వర్షాలతో పత్తి, సోయా, మినుము పంటలు కోల్పోయిన రైతులు కంది అయిన ఆదుకుంటుందనుకుంటే నిరాశే మిగిలింది. పత్తి, సోయాలో అంతర పంటగా వేసిన కంది మొదట ఏపుగా పెరిగినా ఎండు తెగులు సోకి పూత దశలో పంట పూర్తిగా వాడిపోయింది. వాతావరణం అనుకూలించక 50 శాతం పంట నిలువునా ఎండిపోయింది. పూత, కాత దశకు చేరుకోగానే క్రిమికీటకాల ఉధృతి, ఎండు తెగులు కారణంగా పూర్తిగా నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. తెగుళ్లు సోకి 50 శాతం వరకు నిలువునా ఎండిపోయి సగం దిగుబడి కూడా రావడం కష్టమేనంటున్నారు. ఎకరంలో సుమారు 6–7 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా కనీసం క్వింటాల్ కూడా వచ్చే పరిస్థితి లేదని ఆందోళన చెందుతున్నారు. మరోపక్క అడవి జంతువులు ధ్వంసం చేయడంతో చేతికొచ్చిన పంట దెబ్బతిందని, తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు.

జిల్లాలో తొమ్మిదివేల ఎకరాల్లో సాగు..

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం పత్తి, సోయాలో అంతరపంటగా తొమ్మిది వేల ఎకరాల్లో సాగు చేశారు. భైంసా డివిజనల్‌లో కంది అధికంగా సాగు చేసినట్లు వారు తెలిపారు. ఎకరాకు విత్తిన నుంచి ఇప్పటివరకు రూ.10వేల నుంచి రూ.15వేలు ఖర్చు చేశామని చెబుతున్నారు. కంది పంటకు వారానికి ఒకసారి పురుగు మందులు పిచికారీ చేసినా లాభం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని దిగులు చెందుతున్నారు.

అందని గిట్టుబాటు ధర

వచ్చిన కొద్దిపాటి కందిపంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. గతేడాది క్వింటాల్‌కు ప్రభుత్వ కనీస మద్దతు ధర రూ.7,300 ఉండగా, ప్రైవేట్‌లో ధర రూ.9వేల వరకు పలికింది. ఈ ఏడాది ప్రభుత్వం మద్దతు ధర రూ.7,500 మాత్రమే నిర్ణయించిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం క్వింటాల్‌కు ధర రూ.9వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

సగానికిపైగా ఎండిపోయింది



రెండున్నర ఎకరాల్లో పత్తిలో అంతరపంటగా కంది సాగు చేసిన. ఎండు తెగులు సోకి పంట పూర్తిగా ఎండిపోయింది. ఇప్పటివరకు రూ.15 వేలు ఖర్చు చేసిన. పురుగుమందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. రెండు క్వింటాళ్ల దిగుబడి రావడం కష్టమే. అధికారులు కంది పంటకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

– లక్ష్మణ్, ఉమ్రి(కే)

వాతావరణంలో మార్పులతోనే..

ఈ ఏడాది తొలుత కంది పంట బాగానే ఉన్నా పూత, కాత దశలో ఎండు తెగులు సోకి పంట అక్కడక్కడా ఎండిపోయినట్లు రైతులు తెలిపారు. 20 రోజుల క్రితం కురిసిన కొద్దిపాటి వర్షాలు, వాతావరణంలో వచ్చిన మార్పుతో పంటలకు తెగుళ్లు సోకి ఎండిపోయాయి. తానూరు మండలంలోనే అధిక పంటనష్టం జరిగినట్లు గుర్తించాం.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

'అమిత్‌షా క్షమాపణ చెప్పాలి'



నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

నిర్మల్‌టౌన్: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు డిమాండ్ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీహరిరావు ఇంటి నుంచి స్థానిక ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీహరిరావు మాట్లాడుతూ.. దేశంలో 93శాతమున్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం కారణంగానే అన్నింట్లో వాటా పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నిర్మల్, సారంగపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్లు భీమ్‌రెడ్డి, అబ్దుల్ హదీ, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చిన్ను, నాయకులు పోశెట్టి, గణేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణ వసతి కల్పించాలి



నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

నిర్మల్‌టౌన్: అర్హులైన దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీని అమలు చేయాలని దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ నర్సయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట దివ్యాంగులు నిరసన తెలిపారు. అనంతరం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్న తమకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో 100 శాతం రాయితీ కల్పించాలని, రూ.6వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమిటీ రాష్ట్ర కన్వీనర్ సాయన్న, కోకన్వీనర్ ప్రవీణ్‌కుమార్, సభ్యులు ముత్యం, భగవాన్, సత్యనారాయణ, సౌమ్య, భోజారెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా చూడాలి



సమావేశానికి హాజరైన అధికారులు, సిబ్బంది

ఖానాపూర్: రైతులు, ప్రజలకు విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ సుదర్శనం సూచించారు. శుక్రవారం మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని ఎల్ఆర్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్, మామడ మండలాల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరించి ప్రజలు, రైతులు అసౌకర్యానికి గురికాకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు నాగరాజు, లక్ష్మణ్‌నాయక్, రాంసింగ్ తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే రామారావుపటేల్‌కు వినతిపత్రం ఇస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

కుభీర్: సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు శుక్రవారం మండల కేంద్రానికి వచ్చిన ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. తమ సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. తాము చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. తమను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సీఆర్పీలు ఆనంద్, గణేశ్, రాజు, గంగాధర్ తదితరులున్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న డీటీ అశోక్, పాస్టర్లు

భైంసాటౌన్: పట్టణంలోని ఆటోనగర్ మక్రానా ఫంక్షన్‌హాల్‌లో ముధోల్ తాలూకా పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ తహసీల్దార్ అశోక్ హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ రాజ్‌కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, కార్యదర్శి రమేశ్, సభ్యులు సంజీవ్, పీటర్, నాగాజీ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



మండల కేంద్రంలో సమావేశమైన సభ్యులు

లక్ష్మణచాంద: సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్‌కుమార్ ఆదేశానుసారం జిల్లాలోని పలు మండలాల చైర్మన్లను శుక్రవారం ఎన్నుకున్నారు. నిర్మల్ ప్రెసిడెంట్‌గా కోలుకొండ నర్సయ్య, జనరల్ సెక్రటరీగా గంగాసరం సాయన్న, లక్ష్మణచాంద మండల ప్రెసిడెంట్‌గా ఐట్ల సుదర్శన్, చైర్మన్‌గా గుండారపు రాకేశ్, సోన్ మండల చైర్మన్‌గా బక్కురి రవి ఎన్నికయ్యారు. వీరికి ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పండరి, జిల్లా డైరెక్టర్ ఠాగూర్ దత్తు సింగ్ చేతుల మీదుగా నియామక పత్రాలు, ఐడీ కార్డులిచ్చి సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణ చైర్మన్ డాక్టర్ సాప పండరి మాట్లాడుతూ.. సామాజిక సేవే లక్ష్యంగా పని చేయాలని, ప్రాథమిక, రాజ్యాంగపరమైన హక్కులు, ఓటు హక్కు గురించి అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు.

క్లుప్తంగా

బాసరలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పూజలు



పూజలో పాల్గొన్న కుటుంబ సభ్యులు

బాసర: బాసరలో శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని శుక్రవారం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. అర్చకుడు ప్రవీణ్ పాటక్ ఆధ్వర్యంలో ఆయన మనుమడు శ్రీరామ దేవేందర్‌రెడ్డికి అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆలయ అధికారులు ముందుగా వారికి స్వాగతం పలికారు. పూజలు అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. తహసీల్దార్ పవన్‌చంద్ర, పోలీసులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

కలప పట్టివేత



పట్టుబడ్డ కలప

నస్పూర్: పట్టణ పరిధిలో విలేజ్ శ్రీరాంపూర్‌లోని ఓ విస్తారాకుల తయారీ ఫ్యాక్టరీలో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను హైదరాబాద్ ఫారెస్టు విజిలెన్స్, మంచిర్యాల ఫారెస్టు ఫ్లైయింగ్ స్క్వాడ్, ఫారెస్టు అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు ఫ్యాక్టరీపై దాడి చేసి, కలపను స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ అధికారి నరేందర్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 3 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. మంచిర్యాల ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారి రమాదేవి, మంచిర్యాల ఫారెస్టు రేంజ్ అధికారి రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

గుడిహత్నూర్: మండలంలోని మాన్కాపూర్‌లో కుమ్ర హన్మంతు ఇంట్లో గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు హన్మంతు ఇంటిని శుక్రవారం సోదా చేయగా రూ.20వేల విలువ చేసే 800 గ్రాముల గంజాయి లభ్యమైంది. గ్రామ సమీపంలో ఉన్న తన చేనులో గంజాయి సాగైనట్లు తన అవసరానికి దీన్ని విక్రయించడానికి ఉంచినట్లు హన్మంతు అంగీకరించారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

బోథ్: మండలంలోని పొచ్చెర బస్టాండ్ సమీపంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వెంకటేశ్వర రావు, ఎస్సై ప్రవీణ్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. బోథ్ నుంచి పొచ్చెర జలపాతం వరకు శుక్రవారం ఉదయం ఎస్సైతోపాటు ముగ్గురు కానిస్టేబుళ్లు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పొచ్చెర బస్టాండ్ వద్ద బస్సి చందర్ సింగ్ అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులను చూసి పరుగులు తీయగా ఎస్సై పట్టుకున్నాడు. అతని వద్ద ఉన్న నల్లని కవర్‌లో చూడగా 480 గ్రాముల గంజాయి లభ్యమైంది. దీని విలువ రూ.12 వేలు ఉంటుంది. నిందితుడు బస్సి చందర్ సింగ్‌ది నేరడిగొండ మండలం బుద్దికొండ పంచాయతీ పరిధిలో గల రాజులతండా గ్రామం. అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. గంజాయిని ఎవరికి సరఫరా చేస్తున్నారో విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

గురుకులం పిలుస్తోంది..

- 5వ తరగతిలో ప్రవేశాలకు ఆహ్వానం
- ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తుకు గడువు
- 23న ప్రవేశపరీక్ష



బెల్లంపల్లిలోని జనరల్ బాలుర గురుకుల పాఠశాల

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించనున్న ఉమ్మడి ప్రవేశపరీక్ష (వీటీజీ సెట్) నోటిఫికేషన్ విడుదలైంది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) కార్యదర్శి, చీఫ్ కన్వీనర్ అలగు వర్షిణి నోటిఫికేషన్‌ను జారీ చేశారు. దీని ఆధారంగా ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన మెరిట్ విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ప్రవేశం కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఆంగ్లమాధ్యమంలో మెరుగైన విద్యాబోధన చేపడుతారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీస్తూ వారిని సన్నద్ధం చేయనున్నారు.

ప్రవేశం కల్పించనున్న గురుకులాలివే..

వీటీజీ సెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి గురుకుల విద్యాసంస్థల్లో అడ్మిషన్ కల్పిస్తారు. మెరిట్ మార్కుల ప్రాతిపదికన టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, టీజీఆర్‌ఈఐఎస్ (ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్) ఆయా సంక్షేమ శాఖల ద్వారా నిర్వహిస్తున్న గురుకులాలకు ఎంపిక చేస్తారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉచిత భోజన, వసతి ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. గురుకుల విద్యాసంస్థల్లో ఏటా ఉమ్మడి ప్రవేశపరీక్షకు లక్షలాది విద్యార్థులు పోటీపడటం జరుగుతోంది. ఈసారి కూడా మరింత పోటీ ఉండే అవకాశాలు ఉన్నాయి.

ఫిబ్రవరి 1 దరఖాస్తుకు అవకాశం

ఉమ్మడి గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి విద్యార్థులు ఈనెల 21 నుంచి వచ్చే ఏడాది (2025) ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తు చేసుకోవడానికి తుది గడువు విధించారు. ఆన్‌లైన్‌లో రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఒక సెల్ నంబర్‌తో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవల్సి ఉంటుంది. విద్యార్థుల ఎంపికకు పాత జిల్లా ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తమకు బదులు వేరే వారి ఫొటోలు పెట్టి దరఖాస్తు చేసినట్లయితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారు.

ఉమ్మడి జిల్లాలోని గురుకులాలు

జిల్లా	గురుకుల సొసైటీ	గురుకులాలు
మంచిర్యాల	టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	09
మంచిర్యాల	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	08
మంచిర్యాల	టీజీఆర్‌ఈఐఎస్	01
కుమురం భీం	టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	10
కుమురం భీం	టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	05
కుమురం భీం	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	05
ఆదిలాబాద్	టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	03
ఆదిలాబాద్	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	06
ఆదిలాబాద్	టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	13
నిర్మల్	టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	05
నిర్మల్	ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	07
నిర్మల్	టీజీఆర్‌ఈఐఎస్	01
నిర్మల్	టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	01

సద్వినియోగం చేసుకోవాలి



ఐదో తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి నోటిఫికేషన్ వచ్చేసింది. ప్రస్తుతం నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – డి.శ్రీధర్, సంక్షేమ బాలుర గురుకుల సీవోఈ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, బెల్లంపల్లి

23న ప్రవేశపరీక్ష

ఉమ్మడి గురుకులాల్లో నిర్వహించే ప్రవేశపరీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరి 23న ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు.

ఒక్కో గురుకులంలో 80 సీట్ల చొప్పున..

ఆయా గురుకుల విద్యాసంస్థల్లో ఐదో తరగతిలో ఏ,బీ సెక్షన్లు ఉన్నాయి. ఒక్కో సెక్షన్‌కు 40 మంది చొప్పున విద్యార్థులకు అడ్మిషన్ కల్పిస్తారు. ఆ ప్రాతిపదికన ఒక్కో గురుకులంలో రెండు సెక్షన్లను కలిపి గరిష్ఠంగా 80 సీట్లు భర్తీ చేస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 74 గురుకుల విద్యాసంస్థలు ఉండగా వీటన్నింటిలో కలిపి మొత్తం 5,920 మంది విద్యార్థులు ప్రవేశం పొందడానికి అవకాశాలు ఉన్నాయి.

చిట్టి మెదళ్లకు గొప్ప ఆలోచన



పేపర్‌తో తయారు చేసిన బ్యాగులతో విద్యార్థులు, ఎంఈవో పరమేశ్వర్

సోన్: మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల చిట్టి మెదళ్లకు గొప్ప ఆలోచన కలిగిందని ఎంఈవో తొడిశెట్టి పరమేశ్వర్ అన్నారు. ఇంట్లో ప్లాస్టిక్ సంచులు, వాడిన పాత వార్తపత్రికలు, పనికిరాని కాగితాలతో విద్యార్థులు పేపర్ బ్యాగులు తయారుచేసి పాఠశాలలో శుక్రవారం ప్రదర్శించారు. తమ ఇళ్లల్లో ప్లాస్టిక్ సంచులకు బదులుగా పేపర్ బ్యాగులు మాత్రమే వాడతామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారిని ఎంఈవో అభినందించారు. ఉపాధ్యాయులు రమేశ్‌బాబు, మంగమ్మ, శైలజ, విజయవాణి, రాధ పాల్గొన్నారు.

కలప స్మగ్లింగ్‌పై కఠిన చర్యలు

- చెట్ల నరికివేతపై విచారణకు డీఎఫ్‌వో ఆదేశం

సాక్షి ఎఫెక్ట్

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్, ఖానాపూర్ బీట్లలో పలుమార్లు భారీ టేకు చెట్లను నరికివేసి కలప స్మగ్లింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఖానాపూర్ ఎఫ్‌ఆర్వో కిరణ్ తెలిపారు. 'రోడ్డు పక్కనే వన మేదం'శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. చెట్ల నరికివేతపై ఇప్పటికే విచారణ చేపట్టామన్నారు. తమ ప్రాథమిక విచారణలో నలుగురు కలప స్మగ్లింగ్‌కు పాల్పడినట్లు గుర్తించామని తెలిపారు. కాగా, స్మగ్లర్లు తరలించిన కలప విలువ రూ.75 వేలు, నరికి వేసిన చెట్ల దుంగల విలువ రూ.42 వేలు ఉంటుందని తెలిపారు. కాగా, పత్రికలో వచ్చిన కథనానికి నిర్మల్ డీఎఫ్‌వో నాగినిబాను స్పందించారు. కలప స్మగ్లింగ్‌పై సమగ్ర విచారణకు ఆదేశించారు.

కోజ్జన్‌గూడ శివారులో పులి సంచారం?

- కుక్కపై దాడిచేసి హతమార్చిన వైనం



కుక్క కళేబరం

తాంసి: భీంపూర్ మండలం కరంజి(టి), కోజ్జన్‌గూడ శివారుల్లో పులి సంచారం కలకలం రేపింది. కోజ్జన్‌గూడ శివారు సూర్యగుట్ట అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం కుక్కపై పులి దాడి చేసి హతమార్చినట్లు గ్రామస్తులు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. సూర్యగుట్ట అటవీ ప్రాంతం మహారాష్ట్రకు సరిహద్దు ఉండటంతో పులి అక్కడి నుంచి వచ్చిందా లేక చిరుతపులి దాడి చేసి హతమార్చిందా విషయం తెలియాల్సి ఉంది. కాగా, అక్కడ పులి సంచరించినట్లు ఆనవాళ్లు లేవని అర్లి(టి) సెక్షన్ అధికారి మోపత్‌రావు తెలిపారు. కుక్కపై హైనా దాడి చేసి ఉండవచ్చునని అనుమానించారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



ప్రయాణికులను సన్మానిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం, ఉద్యోగులు

ఆదిలాబాద్: ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో శుక్రవారం మర్యాద దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు ప్రయాణికులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ప్రయాణికుల విషయంలో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రణీత్, డీఎం కల్పన, అకౌంట్స్ ఆఫీసర్ శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుకలో దిగబడిన ట్రాక్టర్

- బయటకు తీసే క్రమంలో ప్రమాదం
- ట్రాక్టర్ డ్రైవర్ మృతి



శేఖర్ మృతదేహం

దండేపల్లి: గోదావరి నదిలో దిగబడిన ఇసుక ట్రాక్టర్‌ను బయటికి తీస్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. మండలంలోని గుడిరేవు వద్ద శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిరేవు గోదావరినది వద్ద ఇసుక ట్రాక్టర్ నదిలో దిగబడింది. దాన్ని మరో ట్రాక్టర్‌కు టోచన్ కట్టి బయటకు తీసే క్రమంలో మాదాపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మంత్రి శేఖర్(33) మృతిచెందాడు. దిగబడిన ట్రాక్టర్‌ను మరో ట్రాక్టర్‌తో బయటికి లాగేందుకు శేఖర్ రెండింటి మధ్యలో నిలబడి తాడు కడుతున్నాడు. ఈ సమయంలో ముందుకు లాగే ట్రాక్టర్ ఒక్కసారిగా అదుపుతప్పి రివర్స్ రావడంతో మధ్యన ఇరుక్కుపోయి తీవ్రగాయాలయ్యాయి. దీంతో వెంటనే లక్సెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించే లోపు మృతిచెందాడు. ఈవిషయమై ఎస్సై ఉదయ్‌కిరణ్ సంప్రదించగా ప్రమాదం జరిగింది వాస్తవమే కాని, తమకు ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

డ్రైవర్‌కు అస్వస్థత.. అదుపుతప్పిన బస్సు

- మోటార్‌సైకిళ్లు, కార్లను ఢీకొట్టి..
- ఒకరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన వాహనాలు

మంచిర్యాలక్రైం: ఆర్టీసీ బస్సు నడుపుతున్న డ్రైవర్ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. స్టీరింగ్‌పైనే పడిపోవడంతో బస్సు అదుపు తప్పి రెండు కార్లు, ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని డిపోకు చెందిన బస్సు(టీఎస్ 02 జడ్ 0318) శుక్రవారం మధ్యాహ్నం మంచిర్యాల నుంచి కరీంనగర్‌కు వెళ్తోంది. పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తా, ఐబీ చౌరస్తా రోడ్డు మధ్యలోకి రాగానే డ్రైవర్ లౌకిని ఎల్లయ్య బస్సు నడుపుతూనే ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురై స్టీరింగ్‌పై పడిపోయాడు. దీంతో బస్సు అదుపుతప్పి మోర్ మార్కెట్ ఎదురుగా ఉన్న రోడ్డులో పలు వాహనాలను ఢీకొట్టింది. మొదటగా స్కూటీని ఢీకొట్టి పక్కన నిలిపి ఉంచిన రెండు కార్లు, మరో రెండు ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లడంతో దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో స్కూటీ నడుపుతున్న చింతపండువాడకు చెందిన చింతపండు సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ ఎల్లయ్య త్వరగానే కోలుకుని బస్సును అదుపులోకి తెచ్చినట్లు ప్రయాణికులు తెలిపారు. అనంతరం డ్రైవర్‌ను కూడా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాద విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంచిర్యాల సీఐ తెలిపారు.

20 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

- చోరీకి గురైన ఆటో స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఆటో, నిందితులతో పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో గురువారం చోరీకి గురైన ఆటో కేసును టూటౌన్ పోలీసులు 20 గంటల్లోనే ఛేదించారు. పట్టణంలోని నెహ్రూ చౌక్‌లో శుక్రవారం వాహనాల తనిఖీలు చేస్తుండగా రాంనగర్‌కు చెందిన షేక్ అబ్దుల్, షేక్ అమాన్‌లు ఆటోను విక్రయించేందుకు మహారాష్ట్రలోని కిన్వట్‌కు వెళ్తుండగా పట్టుకున్నారు. ఇదివరకే వీరిపై జైనథ్, గాదిగూడ, మావల పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. జల్సాలకు అలవాటుపడ్డ ఇద్దరు చోరీలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. షేక్ అమాన్ గత జూన్‌లో మావల పోలీసు స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో రూ.20వేల దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. వీరిని విచారించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. కాగా, కేసును ఛేదించిన టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్, ఐడీ పార్టీ నరేశ్, క్రాంతి, గోపాల్, సుధాకర్ రెడ్డి, నరేందర్‌లను ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అభినందించారు.

సీఎం కప్ రెజ్లింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో రెజ్లింగ్‌లో ముల్కల్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 60 కిలోల రెజ్లింగ్ పోటీల విభాగంలో పదో తరగతి విద్యార్థి అలుగునూరి అఖిల్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, మొగిళ్ల చందు ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించారు. వీరితోపాటు పీడీ శ్రీకాంత్, పీఈటీ కిరణ్‌లను పాఠశాల ప్రిన్సిపాల్ కుమ్మరి మోహన్, వైస్ ప్రిన్సిపాళ్లు నగేశ్, రమ్యరాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎనిమిది మంది బైండోవర్

కాసిపేట: మండలంలోని వరిపేట శివారులో పేకాట ఆడుతూ పట్టుబడిన ఎనిమిది మందిని అరెస్టు చేసి తహసీల్దార్ భోజన్న ఎదుట శుక్రవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేయగా ముగ్గురిని పట్టుకోగా, పరారీలో ఉన్న ఐదుగురిని అదుపులో తీసుకుని బైండోవర్ చేశారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

భైంసాటౌన్: అదనపు కట్నం కోసం భార్యను హతమార్చిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ నిర్మల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ తీర్పు ఇచ్చినట్లు పట్టణ సీఐ గోపీనాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని పంజేషాగల్లికి చెందిన మహ్మద్ ముజమ్మిల్‌కు నిజామాబాద్‌కు చెందిన నాజియా సుల్తానాతో వివాహం కాగా, మద్యానికి బానిసగా మారి తరచూ అదనపు కట్నం కోసం వేధించేవాడు. దీంతో ఆమె తన పుట్టింటికి వెళ్లి కొంత నగదు తెచ్చేది. వేధింపులు ఎక్కువ కావడంతో పెద్దల సమక్షంలో నచ్చజెప్పారు. అయినా మళ్లీ వేధించడంతో ఆమె తన పుట్టింటి నుంచి డబ్బులు తేలేదు. ఈక్రమంలో ఆమెపై కక్ష పెంచుకున్న భర్త 2020 జనవరి 1న ఉదయం ఆమె ఒంటిపై డీజిల్ పోసి నిప్పంటించాడు. అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందింది. శుక్రవారం కేసు విచారణకు రాగా, నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవితఖైదు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడినవారికి శిక్ష



బస్టాండ్‌లో క్లీనింగ్ పనులు చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పాతమంచిర్యాల: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జిల్లా సెకండ్‌క్లాస్ అడిషనల్ మెజిస్ట్రేట్ కె.నిరోష శుక్రవారం శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. నలుగురిని బస్టాండ్ క్లీనింగ్‌లో చేయించాలని, 14 మందికి ట్రాఫిక్ అసిస్టెంట్ విధులు, ఎనిమిది మందికి జరిమానా విధించారని పేర్కొన్నారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి



రాములు (ఫైల్)

భీమిని: మండలంలోని ఖర్జీభీంపూర్ గ్రామానికి చెందిన జనగామ రాములు (37) పాముకాటుతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. అక్కలపల్లిలో పెళ్లి కార్యక్రమం కోసం రాములు గురువారం టెంట్ వేయడానికి వెళ్లాడు. రాత్రి కావడంతో పడుకున్నాడు. అర్ధరాత్రి దాటినా తర్వాత పాముకాటేసింది. అక్కడ ఉన్న స్థానికులు కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మృతుడికి కుమార్తె ప్రవస్తి, కుమారుడు నవతేజ్ ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

కాసిపేట: పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు దేవాపూర్ ఎస్సై అంజనేయులు తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని దేవాపూర్ మద్దిమాడకు చెందిన భూనేని సంజీవ్(40) ఓరియంట్ మాజీ పర్మినెంట్ ఉద్యోగి. సంజీవ్ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈక్రమంలో తన ఉద్యోగాన్ని భార్యకు పెట్టించాడు. ఎంతకీ కేన్సర్ వ్యాధి నయం కాకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈనెల 18న గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

చింతలమానెపల్లి: జీవితంపై విరక్తితో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని గూడెం గ్రామానికి చెందిన చౌదరి రూపేష్(24) గురువారం మధ్నాహం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. సాయంత్రం తల్లిదండ్రులు వచ్చి చూసేసరికి అపస్మారక స్థితితోకి వెళ్లిపోయాడు. వారు వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి చౌదరి మొండి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న మల్లయ్య

జైపూర్: మండలంలోని ఇందారం బస్టాండ్ వద్ద శుక్రవారం రాత్రి బైక్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై నాగరాజు కథనం ప్రకారం ...ఇందారం గ్రామానికి చెందిన సుంకరి మల్లయ్య పనినిమిత్తం బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా శ్రీరాంపూర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న బైక్ అతివేగంగా మల్లయ్యను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతన్ని మంచిర్యాలకు తరలించి వైద్యం అందించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో డ్రైవర్‌కు..

భీమిని: కన్నెపల్లి మండలం బొత్తపల్లి శివారు పంట పొలంలో దమ్ము (జంబు) కొడుతున్న ట్రాక్టర్ డ్రైవర్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బొత్తపల్లికి చెందిన లాట్కురి రవి ట్రాక్టర్‌తో పంట పొలంలో శుక్రవారం దమ్ము కొడుతుండగా అక్కడ 11కేవీ విద్యుత్ తీగలు కర్రలతో వేసి ఉన్నాయి. గమనించని రవి ట్రాక్టర్ వెనుకకు తీస్తుండగా కర్రకు తగలడంతో విద్యుత్ తీగలు అతనిపై ముఖంపై పడింది. తీవ్రగాయాలైన క్షతగాత్రుడిని స్థానికులు ప్రైవేటు వాహనంలో మంచిర్యాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వాహనాల వేలం



వేలం వేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో వివిధ కారణాలతో సీజ్ చేసిన వాహనాలకు శుక్రవారం వేలంపాట నిర్వహించారు. మొత్తం 19 వాహనాలకు 16 వాహనాల వేలం పూర్తయినట్లు జిల్లా సూపరింటెండెంట్ ఎండీ రజాక్ తెలిపారు. వీటి విలువ రూ.1,34,000 నిర్ధారించగా.. రూ.2,07,900లకు వేలం పలికింది. జీఎస్టీతో కలిపి మొత్తం రూ.2,62,282 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఎక్సైజ్ సీఐ లక్ష్మణరావు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

AUTOMOBILES
VEHICLE FOR SALE

On where conditions Vehicles for Sale. Ashok Leyland Dosth RLS-2015 - TS01 UB 5703, Mahindra Imperio 2WD- 2018- TS19 T 4676. Mancherial Branch, Indusind Bank Ltd., Contact: 7032987245. [K- 1253276]

EDUCATION

రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr.J S అకాడమి (ISO 9001: 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112 [HA-15347]

SERVICES
BUSINESS SERVICES

మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694. [H-783410]

www.sakshi.com

WANTED

Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256008]

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 18K. Ph: 9640400073, 9160900024 [SCA24000688]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,